క్లుప్తంగా

పల్లకీలో మహానందీశ్వరుడు



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, శాంతారాంభట్, అర్చకులు శర భయ్యశర్మ, టెంపుల్ ఇన్స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజలు, బలిహరణ పూజల అనంతరం పల్లకీలో కొలువు చేశారు. స్థానిక ధ్వజస్తంభం వద్ద స్వామి, అమ్మవారికి హారతులు సమర్పించారు.

లక్ష్మీరంగనాథుడికి ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీరంగనాథ స్వామి, లక్ష్మీదేవి అమ్మవార్ల మూలవిగ్రహాలు



జూపాడుబంగ్లా: తర్తూరు జాతర ముగిసినా లక్ష్మీరంగనాథస్వామి, అమ్మవార్లకు భక్తుల రద్దీ తగ్గలేదు. సోమవారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరో రెండు, మూడు రోజులపాటు స్వామి, అమ్మవార్ల దర్శనానికి భక్తులు వచ్చే అవకాశాలున్నాయని దేవదాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

గోమాతకు అంత్యక్రియలు



ఆవు కళేబరాన్ని ట్రాక్టర్‌లో శ్మశానవాటికకు తరలిస్తున్న గ్రామస్తులు

జూపాడుబంగ్లా: అనారోగ్యంతో మృతిచెందిన గోవుకు అంత్యక్రియలు నిర్వహించారు. మండల కేంద్రంలో దేవుని ఆవుగా పిలుచుకుని గోమాత సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. విషయం తెలుసుకున్న పలువురు గోమాత కళేబరాన్ని నీటితో శుభ్రం చేసి ట్రాక్టర్‌లోకి ఎక్కించారు. మేళతాళాలతో శ్మశానవాటికకు ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

పగిడ్యాల: స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సుజన మంగళగిరికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో సి.వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తామన్నారు.

చట్టాలపై అవగాహన



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ జగన్‌మోహన్

బండిఆత్మకూరు: మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో సోమవారం ఎస్‌ఐ జగన్ మోహన్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పొలాల వద్ద ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువచ్చి సామరస్యంగా పరిష్కరించుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

జిల్లాస్థాయి క్రికెట్ విజేత ఆత్మకూర్ ఏసీఎన్



జిల్లాస్థాయి క్రికెట్ మొదటి విజేత ఆత్మకూరు జట్టు

కొత్తపల్లి: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని శివపురం గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా ఆత్మకూరు ఏసీఎన్ జట్టు నిలిచినట్లు క్రీడా నిర్వాహకులు రాజేష్, ప్రవీణ్ తెలిపారు. సోమవారం గెలుపొందిన జట్లకు నగదు బహుమతుల అందజేశారు. శివపురం ఎస్సీ కాలనీ జట్టు ద్వితీయ స్థానాన్ని కై వసం చేసుకుందన్నారు. విజేతలకు సంఘ పెద్దలు విజయ్, కుమార్, ఏసన్న, పుల్లన్న, పకీరయ్య బహుమతులు అందజేశారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

ఆత్మకూరు: వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లింలు నినదించారు. కేంద్రం ఇటీవల చేసిన వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ముస్లింలు ఆత్మకూరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ్ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ముస్లిం నాయకులు అహ్మద్‌హుసేన్, ముక్తీనూర్ మహమ్మద్, మౌలానా రహంతుల్లా, మౌలానా జబీవుల్లా, ముక్తీ అల్తాఫ్ హుసేన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో తాము ఈ చట్టాన్ని అంగీకరించేది లేదన్నారు. వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను వ్యతిరేకిస్తున్న వైఎస్సార్‌సీపీ, బీఎస్పీ, వామపక్ష పార్టీలతోపాటు మద్దతునిస్తున్న అన్ని పార్టీలకు తాము కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉందంటే అది మన రాష్ట్రంలోని టీడీపీ, ఎన్డీయే కూటమి మద్దతు ద్వారానే అన్నారు. అధికారం ఉందని వక్ఫ్ సవరన చట్టాన్ని అమలు చేస్తే తాము పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. అంతకుముందు ఆత్మకూరు పెద్ద మసీదు నుంచి నంద్యాల టర్నింగ్, రఘునాథ్ సెంటర్, పోలీస్‌స్టేషన్ మీదుగా గౌడ్ సెంటర్‌కు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం కొత్త బస్టాండు మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన కొనసాగించారు. చివరగా రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు జియావుల్లా మౌలానా, గౌస్ మౌలానా, ముర్తుజామౌలానా, అబ్దుల్‌సలాం, మొమిన్‌ముస్తఫా, అంజాద్, సయ్యద్‌మీర్, వరల మాలిక్‌తో పాటు పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అహ్మద్‌హుసేన్



ఆత్మకూరు పట్టణంలో వక్ఫ్‌బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా శాంతియుత ర్యాలీ చేస్తున్న ముస్లింలు

సమస్యలు తెలియజేయండి

కొత్తపల్లి: సమస్యలు అధికారులకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం మండల స్థాయి అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఏదైనా సమస్యలు ఉన్నా తమన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పలువురి నుంచి వినతులు స్వీకరించారు.

బెల్లం ఊట ధ్వంసం

ఆత్మకూరు: మండలంలోని కొట్టాలచెరువు పరిధిలోని నల్లమల అటవీ పరిధిలో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ దాడులు నిర్వహించారు. నాటుసారా బట్టీని ధ్వంసం చేసి, 200 లీటర్ల బెల్లం ఊట, పది లీటర్ల నాటుసారాను పారబోశారు. నిందితులు ఈశ్వరీబాయి, తులసీబాయిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

- బీసీ సెల్ నందికొట్కూరు నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్‌కుమార్

జూపాడుబంగ్లా: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఆ పార్టీ బీసీ సెల్ నందికొట్కూరు నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన పారుమంచాల గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్ పథకాలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యతనిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చాకా కూటమి నేతలు మాట తప్పారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు మండల పరిషత్‌లో 67 శాతం, జిల్లా పరిషత్‌లలో 70 శాతం, మార్కెట్ కమిటీలలో 117 సీట్లు కేటాయించి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారన్నారు. 137 కార్పొరేట్ సీట్లల్లో 58 శాతం, 18 ఎమ్మెల్సీలలో 14, కేబినెట్ మంత్రుల్లో 75 శాతం, 13 జిల్లాల్లో 9 జిల్లా పరిషత్ చైర్మన్ సీట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేటాయించారన్నారు. కూటమి నేతలు మాత్రం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మొండిచేయి చూపుతున్నారన్నారు. తరిగోపులలో బీసీ మహిళా సర్పంచ్‌కు కుర్చీ కూడా వేయకుండా నిల్చోబెట్టడాన్ని బట్టిచూస్తే బీసీలపై వారికున్న ప్రేమ అర్థమవుతుందన్నారు. వక్ఫ్‌బోర్డు సవరణ చట్టానికి మద్దతు పలికి మైనార్టీలకు ద్రోహం చేసిందన్నారు. త్వరలోనే అన్ని వర్గాల ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌కుమార్, నాగరత్నం, జాకీర్‌బాషా, మహేష్‌నాయుడు, యోగేష్‌నాయుడు, సురేష్, మాధవరం ప్రసాదు, ఇబ్రహీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సెల్ నందికొట్కూరు నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్‌కుమార్

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ



స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

తగ్గిన లక్ష్మీరంగనాథస్వామి ఆదాయం

జూపాడుబంగ్లా: గతేడాది కంటే ఈ ఏడాది తర్తూరు లక్ష్మీరంగనాథస్వామి, అమ్మవార్ల హుండీ ఆదాయం తగ్గినట్లు ఆలయ ఈఓ సాయికుమార్ తెలిపారు. సోమవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈఓ సాయికుమార్ అధ్వర్యంలో నంద్యాలకు చెందిన బాలాజీ సేవా ట్రస్టు సభ్యులు స్వామి, అమ్మవార్ల హుండీల్లోని కానుకలను లెక్కించారు. గతేడాది రూ.11,64,901ల ఆదాయం రాగా ఈసారి రూ.11, 21,770 నగదు సమకూరినట్లు ఈఓ తెలిపారు. కాగా టికెట్ల విక్రయం ద్వారా దేవదాయశాఖకు ఎంత ఆదాయం సమకూరిందనే విషయమై వెల్లడించలేదు.



కానుకలు లెక్కిస్తున్న బాలాజీ సేవాట్రస్టు సభ్యులు

నష్ట పరిహారం ఇప్పించండి

పాములపాడు: నేషనల్ హైవే 341 సీ నిర్మాణంలో భాగంగా కోల్పోయిన స్థలానికి పరిహారం ఇప్పించాలని కోరుతూ చిత్తలూరి సూర్యవెంకటసత్యానారాయణ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన జీపీఆర్‌ఎస్‌లో తహసీల్దార్ సుభద్రమ్మకు అర్జీ అందజేశారు. తనకు మండలంలోని యర్రగుడూరు గ్రామంలో సర్వే నెంబరు 591లో 8.53 ఎకరాల భూమి ఉందని, కొంత స్థలం హైవే రోడ్డుకు తీసుకున్నారని, ప్రస్తుతం నిర్మాణం కూడా చేపట్టినా పరిహారం మాత్రం ఇవ్వలేదని వాపోయాడు. అదే సర్వేనెంబరులో భూమి ఉన్న తమ బంధువు ఆ పరిహారాన్ని కాజేసినట్లు తెలిసిందని ఫిర్యాదు చేశాడు. తహసీల్దార్ స్పందిస్తూ విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న రైతు సూర్యవెంకటసత్యనారాయణ

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తాం

వెలుగోడు: అర్హులైన ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు జారీ చేయాలని వీఆర్వోలకు తహసీల్దార్ శ్రీనివాస గౌడ్, ఏఓ పవన్ కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. వారుమాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డుల వల్ల కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు ఎరువులు పొందడానికి, పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి, పంట నష్టం వాటిల్లినప్పుడు నష్టపరిహారం పొందడానికి, పంటల బీమాకు అర్హులవుతారన్నారు. కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

వెలుగోడు మండలంలోని సచివాలయ సిబ్బందికి విపత్తు నిర్వహణపై మూడు రోజులు శిక్షణ ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాస గౌడ్, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈనెల 22, 23, 24 మూడు రోజులు ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి సచివాలయం నుంచి ఒక్కరిని శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్

రక్తదానం సామాజిక బాధ్యత

మహానంది: రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి తెలిపారు. తమ్మడపల్లెలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా 20 మంది వ్యవసాయ విద్యార్థులు రక్తదానం చేశారు. ఏడీ మాట్లాడుతూ రక్తదానం ద్వారా శరీరంలోని ఐరన్ స్థాయి నియంత్రణతో పాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీ ఆర్ మహేశ్వరరెడ్డి, యువజన సంఘం నాయకులు డి.పెద్దమురళీ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మాధవి పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న వ్యవసాయ విద్యార్థులు

అమెరికా ఒప్పందాలను రద్దు చేయాలి

ఆత్మకూరు: రైతులకు వ్యతిరేకంగా ట్రంప్, మోదీ చేసుకుంటున్న ఒప్పందాలను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి వీరన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.స్వాములు డిమాండ్ చేశారు. సోమవారం అమెరికా దేశ ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ గో బ్యాక్ అంటూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ముందు నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ ఉపాధ్యక్షులు ఎ.రణధీర్, నాయకులు సురేంద్ర, ఏపీ రైతుసంఘం నాయకులు కిరణ్, చిన్నఅంబయ్య, సామేలు, వలి పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు రిజిస్ట్రేషన్ ప్రారంభం

బండి ఆత్మకూరు: జొన్న కొనుగోలుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యిందని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వాతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ జొన్న క్వింటా రూ.3,371 మద్దతు ధరతో గ్రామాల్లో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. రైతులు రైతుసేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఉన్నత స్థితికి చేరుకోవాలనే జిజ్ఞాస ఉండాలి

పగిడ్యాల/పాములపాడు: విద్యార్థులు సాధించాలనే తపన, ఉన్నత స్థితికి చేరుకోవాలనే జిజ్ఞాస కలిగి ఉండాలని జిల్లా కెరీర్ హెల్త్ కౌన్సిలర్స్ శ్రీరామ్, నాగన్న తెలిపారు. పదో తరగతి పరీక్షా ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో విద్యార్థుల్లో మనోధైర్యం కోల్పోకుండా ఉండేందుకు నంద్యాల జీసీడీఓ నాగసువర్చల ఆధ్వర్యంలో పరీక్షలు..మార్కులే జీవితమా అంశంపై సోమవారం స్థానిక కేజీబీవీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి ఉష, ఉపాధ్యాయులు రాజేశ్వరి ఉన్నారు.

దంచికొట్టిన వాన

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు వాన దంచికొట్టింది. తాటిపాడు, జూపాడుబంగ్లా, తర్తూరు, మండ్లెం, తంగడంచ, పారుమంచాల, తూడిచెర్ల, తరిగోపుల తదితర గ్రామాల్లో కురిసిన వర్షం 44.6 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. నియోజకవర్గంలోని మిడుతూరు మండలంలో అత్యధికంగా 65.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా కొత్తపల్లి మండలంలో అత్యల్పంగా 2.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూపాడుబంగ్లాలో 44.6ఎం.ఎం, నందికొట్కూరులో 27.4ఎం.ఎం, పగిడ్యాలలో 20.0మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. మండే ఎండల నుంచి కాస్త ఉపశమనం లభించిందని ప్రజలు పేర్కొంటున్నారు.

ఆత్మకూరులో 32.6 మి.మీ. వర్షం

ఆత్మకూరు: మండలంలో సోమవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. 32.6 మి.మీ. వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈనెలలో ఆత్మకూరు మండలంలో సాధారణంగా 16 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటివరకు 89.2 మి.మీ. వర్షం కురిసింది.

పగిడ్యాలలో 20 మి.మీ. వర్షం

పగిడ్యాల: వాతావరణ మార్పుల వల్ల ఉరుములు మెరుపులతో కురిసిన అకాల వర్షం 20 మీ.మీటర్లుగా నమోదైనట్లు తహసీల్దార్ శివరాముడు సోమవారం తెలిపారు. పెనుగాలుల బీభత్సానికి పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పడమర ప్రాతకోటలోని ముస్లీం కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండి జలమయంగా మారడం వలన స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రబీ సీజన్ రెండవ పంటగా సాగు చేసిన మొక్కజొన్న, వరి పంట ఉత్పత్తులు అకాల వర్షానికి తడిసిపోవడం వలన రైతాంగాం పలు అవస్థలు పడ్డారు. వేసవి దుక్కులు చేసుకునేందుకు పొలాలు అనువుగా ఉంటాయని రైతులు అభిప్రాయడుతున్నారు.

ఇద్దరికి స్వల్ప గాయాలు

బండిఆత్మకూరు: మండలంలోని పెద్ద దేవళాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సోమవారం సాయంత్రం అత్మకూరు వైపు నుంచి నంద్యాల వైపుకు వెళ్తున్న మారుతి స్విఫ్ట్ కారును.. సంతజూటూరు వైపు నుంచి ఏకొల అభయాంజనేయ స్వామి గుడి వద్దకు వెళ్తున్న మోటార్ బైకు ఢీకొంది. ప్రమాదంలో కారు పాక్షికంగా దెబ్బ తినగా, బైక్‌పై ఉన్న మల్లేశ్, రాజేశ్ కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దళితుల బహిష్కరణ తగదు

నందికొట్కూరు: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురం పరిధిలోని మల్లం గ్రామంలో అగ్రకులాలు దళితులను గ్రామ బహిష్కరణ చేయడం తగదని మాలమహానాడు నాయకులు డాక్టర్ వెంకటేష్ అన్నారు. సోమవారం మాలమహానాడు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో దళితులు వ్యాపారాలు చేయకూడదని, దళితులకు ఏమీ విక్రయించకూడదని పెత్తందారులు ముక్తకంఠంతో చెప్పడం సమాజం తలదించుకునేలా ఉందన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించే జనసేన పార్టీ అధినాయకుడు పవన్ కళ్యాణ్ ఇంత వరకు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు మధు, శ్రీను, నాగరాజు, నాగేంద్ర, రాజు పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

జూపాడుబంగ్లా: రీసర్వేకు సహకరించాలని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని మండ్లెం గ్రామ సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజులు ముందే రైతులకు నోటీసులు ఇస్తారని, నోటీసులు అందుకున్న రైతులు వారి పొలాలకు సంబంధించిన డాక్యుమెంట్లు, పట్టాపాసుపుస్తకాలతో సర్వే చేసే రోజున పొలం వద్దకు చేరుకుని సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, డీటీ లు నాగన్న, సత్యదీప్, ఆర్‌ఐ అతీఫ్, ఏఎస్ఓ హనుమంతు, వీఆర్వో ఈశ్వరయ్య, సర్వేయర్లు పెద్దబాబు,ఉమారాణి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి

వ్యవసాయ రంగాన్ని తాకట్టు పెట్టేందుకు మోదీ కుట్రలు



దిష్టిబొమ్మను దహనం చేసిన దృశ్యం

నందికొట్కూరు: దేశ వ్యవసాయరంగాన్ని తాకట్టు పెట్టేందుకు ప్రధాని మోదీ కుట్ర పన్నితే సహించే ప్రసక్తే లేదని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, ఫక్కీర్‌సాహెబ్ హెచ్చరించారు. సోమవారం కేజీ రోడ్డుపై సీపీఎం ఆధ్వర్యంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వన్స్ భారత్ పర్యటనను వ్యతిరేకిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, కర్ణ, ఓబులేసు, రషీద్, లక్ష్మన్న, శేఖర్, స్వాములు, ప్రభాకర్, రమణ, బాలరాజు, మద్దిలేటి, జయరాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టంపై ఉద్యమం

నందికొట్కూరు: వక్ఫ్ బోర్డు సవరణ చట్టంపై ఉద్యమిస్తామని ముస్లిం జేఏసీ నాయకులు అబుబక్కర్, పటాన్ సలాం ఖాన్ తెలిపారు. సోమవారం రాయలఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 23న ముస్లిం జేఏసీ వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రద్దు కోసం చేపట్టే మహా నిరసన ర్యాలీకి వామపక్షాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు ఆసిఫ్ మౌలానా, మహబూబ్ మౌలానా, రహిమాన్, దావత్‌బాషా, డక్క కుమార్, శ్రీనివాసులు, రమేష్, సామేల్, రామకృష్ణ, మస్తాన్‌వలి, వెంకటేశ్వర్లు, మధు, ఏసన్న పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామంలో సోమవారం అంతర్రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలను సీఎస్‌ఐ కమిటీ నిర్వాహకులు అట్టహాసంగా ప్రారంభించారు. పోటీల్లో ఆరు జతల వృషభాలు పాల్గొనగా మొదటి బహుమతి రూ.50 వేలను తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలుకు చెందిన వెంకటేశ్వరరావు వృషభాలు, రెండో బహుమతి రూ.40 వేలు రేమటకు చెందిన గిడ్డయ్యనాయుడు వృషభాలు దక్కించుకున్నాయి. మూడో బహుమతి రూ.30 వేలను ఆత్మకూరు డివిజన్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన వెంకటహరిక వృషభాలు దక్కించుకోగా.. నాలుగో బహుమతి రూ.20 వేలను మంగోపేటకు చెందిన వీరాంజనేయులు వృషభాలు, ఐదో బహుమతి రూ.15 వేలను రుద్రవరానికి చెందిన గోపాల్‌గౌడ్ వృషభాలు, ఆరో బహుమతి రూ.10 వేలు ఎ.కోడూరుకు చెందిన నాగేశ్వర్‌రెడ్డి వృషభాలు దక్కించుకున్నాయి. అంతర్రాష్ట్రస్థాయిలో జరిగిన వృషభరాజముల బహుమతులను విజయ్‌కుమార్, జయన్న, ప్రకాశం, రమేష్, అర్జున్, జయన్న, తమ్మడపల్లి కిరణ్‌కుమార్‌లు బహుమతులను అందజేశారు.



బండను లాగుతున్న వృషభాలు

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



జూపాడుబంగ్లా మోడల్ స్కూల్‌లో పరీక్షకు హాజరైన విద్యార్థులు

జూపాడుబంగ్లా: మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. 132 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 123 మంది హాజరయ్యారన్నారు. విద్యార్థుల ప్రశ్నాపత్రాలను పరిశీలించి త్వరలో అర్హులైన జాబితాను వెల్లడిస్తామన్నారు.

ఏడుగురు గైర్హాజర్

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తగరతి ప్రవేశాలకు సోమవారం నిర్వహించిన పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తెలిపారు. 146 మంది దరఖాస్తు చేసుకోగా 139 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

మిడుతూరులో..

నందికొట్కూరు: మిడుతూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు. 146 మంది విద్యార్థులకు గానూ 132 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఈనెల 27న ఫలితాలు వెల్లడిస్తామన్నారు. మార్కులు ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.

మహానంది: ఎం.తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ కూరపాటి లక్ష్మణరావు తెలిపారు. 159 మంది దరఖాస్తు చేసుకోగా 155 మంది హాజరయ్యారన్నారు.